


sahanamvande.com

సహనం వందే

epaper.sahanamvande.com

హైదరాబాద్ | 09-10-2026 శుక్రవారం | సంపుటి-02 సంచిక : 167 EDITOR: ROHINI



డాక్టర్స్ ఫేక్ రేటింగ్స్

ఫైవ్ స్టార్ రేటింగ్ కోసం అడ్డదారులు



- ఏఐతో నకిలీ రోగులు, రివ్యూలు
- ఆన్‌లైన్‌నే ఆశ్రయిస్తున్న ప్రజలు
- అడ్డుకట్టకు ఎన్ఎంసీ మార్గదర్శకాలు

గూగుల్‌లో ఫైవ్ స్టార్ రేటింగ్ చూసి, ఆన్‌లైన్‌లో అద్భుతమైన రివ్యూలు చదివి ఆస్పత్రికి వెళ్తున్నారా? ఏఐతో సృష్టించిన నకిలీ రోగుల అనుభవాలను చూసి మోసపోతున్నారా? ఇకపై అలాంటి ఆన్‌లైన్ గిమ్మిక్కులు నడవవు. డిజిటల్ మాధ్యమాల్లో జరిగే ఫేక్ ప్రచారాలపై నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) కఠిన చర్యలకు సిద్ధమైంది. డాక్టర్లు, ఆస్పత్రులు రోగులను ఆకర్షించడానికి వాడుతున్న అడ్డదారులపై చెక్ పెడుతూ సరికొత్త మెడికల్ ఎథిక్స్ నిబంధనలను అమల్లోకి తెచ్చింది. - సహనం వందే, హైదరాబాద్

చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే గూగుల్‌లో శోధించడం అలవాటుగా మారింది. ఏ డాక్టర్‌కు ఎక్కువ రేటింగ్, ఏ ఆస్పత్రికి మంచి కామెంట్లు వచ్చాయో చూసి అక్కడికి వెళ్తుంటాం. ఇక్కడే కొందరు డాక్టర్లు ఆన్‌లైన్ ప్రచారాలతో వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నారు. అందుకే ఈ డిజిటల్ దందాను అరికట్టేందుకు ఎన్ఎంసీ రంగంలోకి దిగింది. ఇప్పటివరకు వైద్య రంగంలో నేరుగా ఇచ్చే ప్రకటనలపై కొన్ని పరిమితులు ఉండేవి. కానీ ఆన్‌లైన్ వేదికలు విస్తరించడంతో ప్రచారాల శైలి మారిపోయింది. డాక్టర్లు, ఆస్పత్రులు సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్ల ద్వారా రోగులను ఆకర్షిస్తున్నారు. అందుకే ఆన్‌లైన్ ప్రచారాలను, రోగులను ఆకట్టుకునే మార్గాలను మెడికల్ ఎథిక్స్ పరిధిలోకి తెచ్చారు.

డబ్బులతో రేటింగ్‌లకు చెక్

ఇంటర్నెట్‌లో కనిపించే ఫైవ్ స్టార్ ర్యాంకింగ్‌లలో కొన్ని నిజమైనవి కావు. ఏజెన్సీలకు డబ్బులు చెల్లించి ర్యాంకింగ్‌లు కొనుగోలు చేసే సంస్కృతి పెరిగింది. ఇలా డబ్బులతో టాప్ ర్యాంకింగ్ తెచ్చుకోవడాన్ని ఎన్ఎంసీ నిషేధించింది. ఇవి రోగులను తప్పుదోవ పట్టిస్తాయని, వైద్య నీతికి విరుద్ధమని స్పష్టం చేసింది. ఫేక్ రివ్యూలను పూర్తిగా నిషేధిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే డాక్టర్లు, ఆస్పత్రులపై తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రెఫరల్ ఫీజులకు నో


ఒక డాక్టర్ మరో డాక్టర్‌కు లేదా ఆస్పత్రికి రోగులను పంపినప్పుడు కమీషన్లు లేదా రెఫరల్ ఫీజులు తీసుకోవడంపై ఎన్ఎంసీ పూర్తి నిషేధం విధించింది. రోగికి అవసరమైన చికిత్స అందించడమే ధ్యేయంగా ఉండాలి తప్ప కమీషన్ల కోసం రోగులను వేరే చోటికి పంపడం నేరమని తేల్చి చెప్పింది. ఉచిత సేవలు లేదా కమీషన్ల ఆశ చూపి రోగులను ఆకర్షించకూడదు. వైద్య రంగంలోకి ఏఐ సాంకేతికత విస్తృతంగా ప్రవేశించింది. దాని సాయంతో లేని రోగులను సృష్టించి వారి పేరిట నకిలీ టెస్టిమోనియళ్లను తయారు చేస్తున్నారు. వ్యాధి నయమైపోతుందని ఏఐతో వీడియోలు, ఆడియోలు సృష్టించి ప్రచారం చేసుకుంటున్నారు.

నిజమైన సమాచారానికే అనుమతి

ఏఐని ఉపయోగించి రోగుల ఫీడ్‌బ్యాక్‌లను తయారు చేయడం లేదా ఉన్న నిజాలను మార్చడాన్ని ఎన్ఎంసీ పూర్తిగా నిషేధించింది. రోగుల అనుభవాలను కృత్రిమంగా సృష్టించడం వల్ల ప్రజలు తప్పుడు నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉంది. నిజమైన రోగుల సమాచారాన్ని మాత్రమే, వారి పూర్తి సమ్మతితోనే బహిర్గతం చేయాలి. కొన్ని ఆస్పత్రులు ఇచ్చే అబద్ధపు హామీలు, తప్పుదోవ పట్టించే క్లెయిమ్‌లపై కూడా ఉక్కుపాదం మోపారు. నూటికి నూరు శాతం వ్యాధి నయం చేస్తామని, కొన్ని రోజుల్లోనే ఉపశమనం కలిగిస్తామని ఇచ్చే గ్యారెంటీ ప్రచారాలను నిలిపివేయాలి. వైద్యంలో ఏ చికిత్సకూ నూటికి నూరు శాతం గ్యారెంటీ ఉండదని ఎన్ఎంసీ స్పష్టం చేసింది.

నిజాయితీ వైద్యానికి మేలు

ఈ కొత్త నిబంధనల వల్ల నిజాయితీగా పనిచేసే వైద్యులకు, ఆస్పత్రులకు మేలు జరుగుతుంది. కేవలం ప్రచారాల మీద ఆధారపడి రోగులను ఆకర్షించే వారి ఆటలు ఇకపై సాగవు. డిజిటల్ మాధ్యమాల్లో వైద్య నీతిని పాటించడం వల్ల రోగులకు సరైన సమాచారం అందుతుంది. వైద్యం అనేది లాభాపేక్షతో కూడిన వ్యాపారం కాదని, అదొక పవిత్రమైన సేవ అని ఎన్ఎంసీ మరోసారి గుర్తుచేసింది. ఎన్ఎంసీ నిర్ణయం వల్ల ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు.



వెజ్ 30... నాన్ వెజ్ 59

ఇంట్లో ఒకరికి వండటానికయ్యే ఖర్చు ఇది

- శాకాహార భోజనం తయారీ ఖర్చు పెరుగుదల
- మాంసాహార భోజనమూ మరింత వ్యయం
- ఉల్లి, పప్పులు, గ్యాస్ ధరల ప్రభావం
- పండుగల వేళ మరింత పెరిగే అవకాశం
- క్రిసిల్ ఇన్టెలిజెన్స్ తాజా నివేదిక వెల్లడి

ఇంట్లో వండుకుంటే ఖర్చు తగ్గుతుందని భావించే రోజులు పోయాయా? సామాన్యుడి వంట గదిపైనా ధరల భారం పడుతోంది. కూరగాయలు, ఉల్లి, పప్పులు, నూనె, వంటగ్యాస్ ధరలు కలిసి భోజనాన్ని ఖరీదైన వ్యవహారంగా మార్చాయి. వెజ్ భోజనమే రూ. 30 దాటితే, నాన్‌వెజ్ రూ. 60కి చేరువైంది. పండుగల వేళ పరిస్థితి మరింత దారుణంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. - సహనం వందే, హైదరాబాద్



క్రిసిల్ ఇన్టెలిజెన్స్ తాజా నివేదిక ప్రకారం సెప్టెంబర్ 2026లో ఇంట్లో ఒక మనిషికి సరిపడా ఒక పూట శాకాహార భోజనం తయారు చేయడానికి సగటున రూ. 30.8 ఖర్చు అవుతోంది. గతేడాది ఇదే సెప్టెంబర్ నెలలో రూ. 28.1 మాత్రమే ఖర్చు అయ్యేది. అంటే ఏడాది కిందటితో పోలిస్తే ఇప్పుడు రూ. 2.70 ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇక మాంసాహార భోజనం విషయానికి వస్తే ప్రస్తుతం ఒక మనిషికి రూ. 59.5 ఖర్చు అవుతోంది. గతేడాది సెప్టెంబర్‌లో ఈ ఖర్చు రూ. 56 ఉండేది. అంటే ఇప్పుడు రూ. 3.50 అదనంగా ఖర్చవుతోంది.

ఉల్లి ధరతో వంటగదిపై భారం

అయితే ఈ సాదాసీదా వెజిటేరియన్ భోజనం తయారీ ఖర్చు పెరగడానికి ప్రధాన కారణం ఉల్లిపాయల ధరలు పెరగడమే. గతేడాది కిలో రూ. 28 ఉన్న ఉల్లిపాయ ధర, ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి రూ. 53 చేరింది. అంటే కిలోకు రూ. 25 అదనంగా భారం పడింది. ఉల్లిపాయలతో పాటు రోజూ వంటల్లో వాడే పప్పు ధాన్యాలు, వంట నూనెల ధరలు కూడా పెరిగాయి. దీనికి తోడు వంట గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడం వల్ల ఇంధన ఖర్చు కూడా పెరిగింది. ఈ దినుసులు, గ్యాస్ ధరలు పెరగడం వల్లే వెజ్ భోజనం తయారీ వ్యయం రూ. 30 దాటిపోయింది.

వర్షాభావంతో ధరల మంట

వాతావరణ మార్పులు కూడా ఈ వంటగది బడ్జెట్‌ను దెబ్బతీశాయి. జూన్ నెలలో సాధారణం కంటే 40 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో ఖరీఫ్ పంటల నాట్లు ఆలస్యమయ్యాయి. దీనివల్ల మార్కెట్‌కు కొత్త దిగుబడులు రాక ఉల్లి, కూరగాయల కొరత ఏర్పడి ధరలు పెరిగాయి. ఇక నాన్ వెజ్ భోజనం తయారీ ఖర్చులో ప్రధానంగా వాడే బ్రాయిలర్ కోడి మాంసం ధరలు మార్కెట్‌లో కొంతవరకు స్థిరంగా ఉన్నాయి. చికెన్ ధరల్లో పెద్దగా మార్పులు రాకపోవడమే నాన్ వెజ్ భోజనం తయారీ ఖర్చు పెద్దగా మారకుండా ఉండటానికి కారణమైంది.

పండుగల వేళ మరింత భారమా?

ఈ లెక్కలను క్రిసిల్ సంస్థ ఒక ఇంట్లో ఆరుగురు ఉన్న కుటుంబానికి సరిపడా వంట చేసినప్పుడు ఒక ప్లేటు భోజనంలో ఉండే రొట్టె, బియ్యం, పప్పు, కూర, పెరుగు, సలాడ్ల దినుసుల ధరలను బట్టి వేస్తుంది. అలాగే నాన్ వెజ్ భోజనంలో పప్పు స్థానంలో చికెన్‌ను చేర్చి తయారీ వ్యయాన్ని లెక్కిస్తుంది. రాబోయే పండుగల సీజన్‌లో మార్కెట్‌లో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. కొత్త పంటల దిగుబడి మార్కెట్‌కు పూర్తిస్థాయిలో వస్తే తప్ప ఈ నిత్యావసరాల ధరలు తగ్గేలా లేవు. అప్పటివరకు ఈ వంట ఖర్చులు సామాన్య కుటుంబ బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపేలా కనిపిస్తున్నాయి.

స్టార్‌డమ్... సింగిల్ బెడ్ రూమ్

కోట్ల ఆస్తి ఉన్నా నానా పటేకర్ సింపుల్ లైఫ్

- షూటింగులకు 30 ఏళ్లు ఆటోలోనే ప్రయాణం
- రైతుల కన్నీళ్లకు అండగా నిలిచిన నటుడు
- సంపద కంటే మానవత్వానికే విలువ

వందల కోట్ల ఆస్తిపాస్తులు, విలాసవంతమైన కార్లు కొనే స్తోమత ఉన్న ఒక సెలబ్రిటీ ఏళ్ల తరబడి ఆటోలోనే ప్రయాణించారంటే మీరు నమ్ముతారా? అసలు అంత పెద్ద స్టార్ అయి ఉండి, ఆడంబరాలకు దూరంగా సింగిల్ బెడ్‌రూమ్ ఇంట్లో చాలా కాలం జీవించడం సాధ్యమేనా? వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇదంతా నిజం. సినీ రంగుల ప్రపంచంలో మెరిసిపోతూ కూడా నేలవిడిచి సాము చేయని నానా పాటేకర్ జీవన ప్రయాణం చూస్తే ఎవరికైనా కళ్లు చెమర్చాల్సిందే. ఆయన జీవన విధానం, స్ఫూర్తిదాయక ప్రయాణం వెనుక ఉన్న అసలు నిజాలేంటో చూద్దాం. - సహనం వందే, మహారాష్ట్ర

సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి ఒక్క హిట్టు కొడితే చాలు చాలామంది స్టార్లకు కాళ్ల కింద భూమి కనిపించదు. విలాసవంతమైన బంగ్లాలు, కోట్ల విలువైన లగ్జరీ కార్ల కొనుగోలుతో సందడి చేస్తుంటారు. కానీ నానా పాటేకర్ మాత్రం ఎంత ఎదిగినా ఒదిగి ఉండడానికే ప్రాధాన్యమిచ్చారు. షూటింగ్‌లకు వెళ్లాలన్నా కేవలం ఆటోలోనే ప్రయాణించేవారు. ఎంతటి ప్రజాదరణ పొందినా, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నా కూడా ఆయన లగ్జరీ కార్లను ఉపయోగించలేదు. వందల సినిమాల్లో నటించి కోట్ల రూపాయలు సంపాదించినా ఒకే సింగిల్ బెడ్‌రూమ్ ఇంట్లో చాలా కాలం ఉన్నారు. అప్పట్లో సినీ కళాకారుల కోసం ప్రభుత్వం కట్టించి ఇచ్చిన ఇంట్లోనే నివసించారు. ఈ నిరాడంబరత్వం ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టింది.

కష్టాల నుంచి నటుడిగా ఎదుగుదల

తండ్రి మంచాన పడటంతో చిన్న వయసులోనే కుటుంబ భారం నానా పాటేకర్‌పై పడింది. సినిమా పోస్టర్లకు రంగులేస్తే వచ్చే డబ్బులతో ఒక పూట భోజనం, నాన్న మందుల అవసరాలు తీర్చేవారు. పదో తరగతి పూర్తి చేసి ఆర్ట్స్‌లో డిప్లొమా చేసిన ఆయన బతుకుతెరువు కోసం నాటకాల్లో నటించడం మొదలుపెట్టారు. రంగస్థలంపై గుర్తింపుతో పాటు అప్పటి నటి స్మితా పాటిల్ సహకారంతో 'ఆజ్ కీ ఆవాజ్' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. అయితే ఆ సినిమాలో రేప్ సీన్‌లో నటించాలని దర్శకుడు చెప్పగా తనకు అలాంటి సన్నివేశాల్లో నటించడం ఇష్టం లేదని అక్కడి నుంచి వచ్చేశారు. ఆయన వ్యక్తిత్వం నచ్చి దర్శకుడు పిలిచి మరీ అదే సినిమాలో మరో పాత్ర ఇచ్చారు. అలా సినిమాల్లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ అత్యుత్తమ నటుల జాబితాలో స్థానం దక్కించుకున్నారు.

నటనకు అంకితభావం.. రైతులకు అండ

వెండితెరపై ఆయన నటనకు జాతీయ అవార్డులు, ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, పద్మశ్రీ వంటి ఎన్నో గౌరవాలు దక్కాయి. కానీ అవేవీ తన జీవితానికి కొలమానం కాదని నానా పాటేకర్ భావించేవారు. సినిమాల్లో పాత్ర కోసం సైనిక శిక్షణ తీసుకుని కళ పట్ల తనకున్న అంకితభావాన్ని చాటుకున్నారు. సమాజంలోని అన్యాయాలను ప్రశ్నించే కోపంతో కూడిన పాత్రల్లో ఆయన జీవించిన తీరు ప్రేక్షకుల మనస్సుల్లో నిలిచిపోయింది. ఒకసారి రైతుల ఆత్మహత్యల వార్త విని నానా పాటేకర్ చలించిపోయారు. తన దగ్గరున్న డబ్బుతో కొన్ని కుటుంబాలనైనా నిలబెట్టాలని అనుకున్నారు. అప్పుల బాధతో సతమతమైన రైతు కుటుంబాలను ఆదుకునేందుకు నేరుగా రంగంలోకి దిగారు. వారి అప్పులు తీర్చడానికి ఆర్థిక సాయం అందించారు. తన దగ్గరున్న డబ్బు అయిపోయే వరకు అలా ఇవ్వడానికి సిద్ధమేనని ఒక సందర్భంలో స్పష్టం చేశారు.



సంపద కంటే మానవత్వం

సినిమాల్లో ఎంతటి మహోన్నత పేరు తెచ్చుకున్నా ఆయన ఎప్పుడూ సాధారణ జీవితాన్నే కోరుకున్నారు. ఎంతటి వ్యక్తులైనా సరే తన ఇంటికి వస్తే ఆప్యాయంగా పలకరించేవారు. ఆడంబరాల కంటే పక్కన ఉన్న మనుషుల బాధలను పంచుకోవడమే నిజమైన జీవితమని ఆయన నమ్మేవారు. రూపాయి విలువ, ఆకలి బాధ తెలిసిన వ్యక్తిగా సంపాదించిన దాంట్లో ఎక్కువ భాగం సమాజానికే తిరిగి ఇచ్చారు. నటుడిగా ఒక తరం ప్రేక్షకులపై చెరగని ముద్ర వేసిన నానా పాటేకర్, రీల్ హీరోగా మాత్రమే కాకుండా రియల్ హీరోగా నిలిచారు. ఈ నటుడి ప్రయాణం తరతరాలకు ఒక గొప్ప మార్గదర్శి.